క్లుప్తంగా

విద్యుత్ సరాఫరాకు నేడు అంతరాయం

ఏలేశ్వరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని చైతన్యనగర్, సి.రాయవరం కాలనీ, గొల్లలమెట్ట, దిబ్బల పాలెం, లింగంపర్తి రోడ్డు, మార్కెట్ రోడ్డు, కాలేజ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

స్పార్క్ చైర్మన్ సాయి సందీప్‌కు సన్మానం



ఏలేశ్వరంలో సాయిసందీప్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలో బుధవారం స్పార్క్ సంస్థ చైర్మన్ సాయి సందీప్‌ను ఘనంగా సన్మానించారు. ఇటీవల సాయిసందీప్ విశిష్ట సేవా పురస్కారం అందుకోవడంతో వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు ఆధ్వర్యంలో ఆయనకు శాలువా కప్పి పూల మాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ మండలంలోని యర్రవరం గ్రామానికి చెందిన సాయిసందీప్‌కు విశిష్ట సేవా పురస్కారం రావడం అభినందనీయమన్నారు. సాయిసందీప్ మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అర్బన్, రూరల్ కమిటీ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, నాయకులు గొల్లపల్లి సురేష్, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, పైల విజయ్‌కుమార్, డేగల చంద్రమౌళి, లోగీసు శేఖర్, ధనబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు పోలింగ్ కేంద్రాలు

ప్రత్తిపాడు: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ప్రత్తిపాడు మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తహసీల్దార్ ఎం.సత్యప్రభ తెలిపారు. స్థానిక తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల నిర్వహణకు ఇద్దరు పోలింగ్ ఆఫీసర్లు, ఆరుగురు ఓపీఓలను నియమించినట్టు చెప్పారు. ఈ ఎన్నికల్లో మండలంలోని 1.042 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తహసీల్దార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ప్రత్తిపాడు: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై ఎస్. లక్ష్మీకాంతం బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని లంపకలోవ గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరబాబుకు ముగ్గురు సంతానం. ఈ నెల 3వ తేదీన పిల్లలు టీవీ రిమోట్ పాడు చేయడంతో మందలించాడు. భర్త మందలించాడని మనస్తాపం చెందిన వీరబాబు భార్య వాసంశెట్టి భవానీ (22) గడ్డిమందు తాగింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని శవపరీక్షకు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుని దర్శించిన నీతి ఆయోగ్ సభ్యుడు సరస్వత్



సత్యదేవుని సన్నిధిలో నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సరస్వత్, కుటుంబ సభ్యులు

అన్నవరం: కేంద్ర నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సరస్వత్ కుటుంబ సభ్యులతో కలిసి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ వి. సుబ్బారావు అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వేములపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ తుట్టా సత్యనారాయణమ్మ కుమారుడు నాగభూషణం ఇటీవల కంటి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయన కుటుంబాన్ని బుధవారం ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జమీంధార్, పిల్లి రాఘవ, తుట్ట గోవింద్, దిడ్డి వీరులు, వేమగిరి వీర నాగేశ్వరరావు, తుట్ట అర్జునుడు, మొల్లి సూరిబాబు, తుట్ట శ్రీను పోకనాటి నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు తదితరులు పాల్గొన్నారు

సాగునీటి సమస్యకు మోక్షం !

- ఫలించిన పేర్రాజు చెరువు ఆయకట్టు రైతుల న్యాయపోరాటం
- రైతులకు అండగా హైకోర్టు
- ఆఫ్టేక్ స్లూయిజ్ ద్వారా నీరందించాలని అధికారులకు ఆదేశం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



ధర్మవరంలోని పేర్రాజు చెరువు



పేర్రాజు చెరువు దిగువన ఉన్న పోలవరం కాలువ

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలోని పేర్రాజు చెరువు ఆయకట్టు రైతుల సుదీర్ఘ న్యాయపోరాటం ఎట్టకేలకు ఫలించింది. హైకోర్టు ఆయకట్టు రైతులకు మద్దతుగా నిలిచింది. ఈ మేరకు గ్రామంలోని పేర్రాజు చెరువు ఆయకట్టుకు సాగునీరు అందించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ చెరువు 300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే సామర్థ్యం కలదు. ఈ చెరువుకు సమాంతరంగా చెరువు గర్భంలో నుంచి పోలవరం, పుష్కర కాలువల తవ్వకాలు చేపట్టడంతో ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది.

2010లో రిట్ పిటిషన్

పేర్రాజు చెరువు ఆయకట్టుకు సాగునీరు అందించాలని గ్రామానికి చెందిన ఆయకట్టు రైతులు 2010 ఆగస్టులో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిష్కరిస్తూ హైకోర్టు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు అప్‌టేక్ స్లూయిస్ నిర్మించి పేర్రాజు చెరువు ఆయకట్టుకు ఆరునెలల్లో నీరు అందించాలని 2022 జులై 28న ఆదేశించారు. ఆ మేరకు పనులు జరగకపోవడంతో రైతు సిద్దా అప్పలరాజు తరఫున న్యాయవాది కొమ్ముల శేషగిరిరావు కోర్టు ధిక్కార పిటిషన్‌ను హైకోర్టులో దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారణకు స్వీకరించారు. దీనిపై హైకోర్టు పోలవరం అధికారులను వివరణ కోరింది. ప్రతిపాదిత స్లూయిస్ నిర్మాణంపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (ఢిల్లీ)కి నివేదించామని అక్కడ నుంచి కొన్ని సూచనలు చేయడంతో మార్పులు చేసి పంపామని పోలవరం అధికారులు హైకోర్టుకు నివేదించారు. డీపీఆర్ మంజూరు అయిన వెంటనే టెండరు ప్రక్రియ పూర్తిచేసి పోలవరం కాలువపై 70.184 కిలో మీటర్ల వద్ద సంబంధిత డివిజన్ స్లూయిస్ నిర్మిస్తామని హైకోర్టులో తమ వివరణను అధికారులు రికార్డు చేశారు. ఈ మేరకు పోలవరం అధికారులు హైకోర్టుకు నిర్దిష్టమైన హామీ ఇవ్వడంతో రైతుల న్యాయపోరాటం ఫలించినట్లు అయింది.

ధర్మవరంలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉండే పేర్రాజు చెరువులోంచే పుష్కర, పోలవరం కాలువల తవ్వకాలు జరిపారు. సమాంతరంగా వెళ్లే కాలువలు గ్రామంలోని చెరువు ఉనికిని దెబ్బ తీశాయి. ఈ చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం పరిస్థితి తారుమారైంది. పేర్రాజు చెరువు దిగువన రామభద్రరాజుచెరువు, ఇంటివారి చెరువు, తమ్మయ్య, ముసలిమాను, వెంకటపతిరాజు చెరువులకు పేర్రాజు చెరువు నుంచి నీరు అందని పరిస్థితి నెలకొంది. గొలుసు కట్టు దెబ్బతినడంతో ఈ చెరువల పరిధిలోని మూడు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. పోలవరం కాలువ నిర్మాణం ప్రారంభం నుంచి ఇప్పటికే ఇదే పరిస్థితి కొనసాగుతోంది. స్లూయిస్ ఏర్పాటు చేసి నీరు ఇప్పించమని గ్రామానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, మంత్రులను పేర్రాజు చెరువుకు తీసుకెళ్లి రైతులు పరిస్థితిని వివరించేవారు. పోలవరం ప్రధాన కాలువ వెళ్తున్నందున ధర్మవరం ఆయకట్టు అందులో ఉందనే అధికారుల వాదన రికార్డులకే పరిమితమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోర్టు ఆదేశాల మేరకు పోలవరం కాలువకు ఆఫ్టేక్ స్లూయిస్ నిర్మిస్తే ఆయకట్టుకు పూర్వ వైభవం వస్తుందని గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోర్టు ఆదేశాలను అమలు చేయాలి



కోర్టు ఆదేశాల మేరకు పోలవరం కాలువపై ఆఫ్టేక్ స్లూయిస్ నిర్మాణ పనులు చేపట్టి పేర్రాజు చెరువు ఆయకట్టుకు సాగునీరు అందించాలి. పోలవరం, పుష్కర కాలువలు తవ్వకాలు జరిపిన నాటి నుంచి పేర్రాజు చెరువుకు సాగు నీరు అందని పరిస్థితి నెలకొంది. అప్పటి నుంచి ఆయకట్టుకు సాగు నీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికైనా ఆయకట్టుకు సాగునీరు అందించాలి.

– సిద్దా అప్పలరాజు, ఆయకట్టు రైతు, ధర్మవరం

మూడు వేల ఎకరాలకు అందని నీరు



పేర్రాజు చెరువు మీదుగా పోలవరం, పుష్కర కాలువల తవ్వకాలు చేపట్టడంతో దిగువన గల 3 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. పేర్రాజు చెరువు దిగువన రామభద్రరాజు చెరువు, ఇంటివారి చెరువు, తమ్మయ్య, ముసలిమాను, వెంకటపతిరాజు చెరువులు ఉన్నాయి. ఈ చెరువలకు పేర్రాజు చెరువు నుంచి నీరు రావల్సి ఉంది. పోలవరం, పుష్కర కాలువ తావ్వకాల వల్ల పేర్రాజు చెరువు నుంచి దిగువకు నీరు పారని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా చెరువుల పరిధిలోని మూడు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడంలేదు. ఆఫ్టేక్ స్లూయిస్ నిర్మించి ఆయకట్టుకు సాగునీరు అందించాలి.

– జువ్వల దొరబాబు, ఆయకట్టు రైతు, ధర్మవరం.

పథకం ప్రకారమే ముద్రగడ ఇంటిపై దాడి

ఖండించిన వైఎస్సార్ సీపీ నాయకులు

అన్నవరం: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం ఇంటిపై పథకం ప్రకారమే దాడి జరిగిందని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. అన్నవరంలో బుధవారం ఎంపీటీసీ దడాల సతీష్, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, పార్టీ నాయకుడు కొండపల్లి అప్పారావు తదితరులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ముద్రగడ ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ దాడిని చూస్తే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతోందన్నారు. జనసేన కార్యకర్త ట్రాక్టర్‌తో దాడి చేసి ముద్రగడ కారును ఢీకొట్టడం, అనంతరం ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడడం చూస్తుంటే ఒక పథకం ప్రకారమే కుట్ర జరిగినట్లు తెలుస్తోందని ఆరోపించారు. పోలీసులు ఈ కుట్రను చేదించి ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. పార్టీ నాయకులు అల్లాడ సూరిబాబు, ఈగల రాఘవ, తాటిపాక కృష్ణ, చిన్నా మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.



అన్నవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో క్షేత్రపాలకుడు అభయాంజనేయస్వామికి విశేష స్నపనం, హనుమత్ హోమం నిర్వహించారు. దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, తులసీ, విద్యుత్‌శాఖ ఏఈ వైవీఎస్ సుబ్రహ్మణ్యం దంపతులు పీటలపై కూర్చొని పూజలు చేశారు. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ, ప్రధాన హోమాలు, నిత్యోపాసన వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



తంటికొండ వెంకన్న ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

నేడు గిరి ప్రదక్షిణ

బ్రహ్మోత్సవాల్లో నాల్గో రోజు గురువారం ఉదయం స్వామివారి గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం శ్రీలక్ష్మీనారసింహ సహిత మహా సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు జరుగుతాయని వివరించారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన



బెండపూడిలో కషాయాల తయారీ విధానాన్ని తెలుసుకుంటున్న శ్రీలంక రైతుల బృందం

తొండంగి: జిల్లా పర్యటిస్తున్న శ్రీలంక రైతులు బుధవారం మండలంలోని బెండపూడిలో రైతులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రకృతి సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. తెగుళ్ల నివారణకు వినియోగించే ఆవు మూత్రం, ఆవుపేడ, పలు రకాల కషాయాల తయారీ, ఘన జీవామృతం తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకుని నమోదు చేసుకున్నారు. తమ దేశంలో ఈ విధానాన్ని అమలుకు సాధ్యాసాధ్యాలపై చర్చించుకున్నారు. వ్యవసాయంలో నూతన ఒరవడి అయిన ప్రకృతి సాగు ఎంతో లాభదాయకం, ఆరోగ్యదాయకమని అభిప్రాయం వ్యక్తం చేశారు. వారి వెంట ఏఒ ఎస్.నరసింహం ఉన్నారు.

పెట్రోల్ బంకు వద్ద ఆందోళన

గోకవరం: స్థానిక తాణాసెంటర్ సమీపంలోని రంపచోడవరం వెళ్లే మార్గంలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద బుధవారం ఆయిల్ కొలతల్లో వ్యత్యాసం వచ్చిందంటూ వినియోగదారులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. కొందరు యువకులు మధ్యాహ్నం సమయంలో ఖాళీ ప్లాస్టిక్ బాటిల్‌లో రూ.100 ఆయిల్ కొట్టించుకున్నారు. కాగా తక్కువ పెట్రోల్ వచ్చిందని యువకులు ఆందోళనకు దిగారు. గతంలో ఇదే బంకులో అవకతవకలకు పాల్పడటంతో బంకును సీజ్ చేశారని, అయినప్పటికీ నిర్వాహకుల తీరులో మార్పులేదని విమర్శించారు. దీనిపై సమాచారం అందుకున్న రాజమహేంద్రవరం తూనికలు, కొలతల శాఖ అధికారులు బంకు వద్దకు వచ్చి తనిఖీలు నిర్వహించారు. ఈ సంఘటనపై ఆర్ఐ అహ్మద్‌వల్లిని వివరణ కోరగా తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీల్లో సక్రమంగా ఉన్నట్టు గుర్తించామన్నారు.

ఎలుకల నివారణకు మందు

గండేపల్లి: రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు పంపిణీ చేయనున్నట్టు మండల ఏఓ సద్గురుమూర్తి తెలిపారు. మండలంలోని మల్లేపల్లి, బొర్రంపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామూహిక ఎలుకల నిర్మూలనలో భాగంగా శుక్రవారం నుంచి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తామని చెప్పారు.

ముగిసిన సత్తెమ్మతల్లి జాతర



ప్రత్తిపాడులో సత్తెమ్మతల్లిని ఘటంతో ఊరేగిస్తున్న భక్తులు

ప్రత్తిపాడు: స్థానిక రాజుగారి వీధిలో వేంచేసిన సత్తెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారంతో ము గిశాయి. ప్రత్తిపాడు గ్రామంతో పాటు సమీప గ్రామా ల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఐదురోజుల పాటు అంగరంగ వైభవంగా జాతరోత్సవాలు జరిగాయి. కాగా చివరి రోజు బు ధవారం అమ్మవారిని ఘటంలో ఉంచి, పంపనాదం వంశానికి చెందిన పురుషుడు మహిళ వేషధారణ ధరించి అమ్మవారిని శిరస్సున దాల్చి కాలినడకన గ్రామోత్సవం నిర్వహించారు. అడుగడుగునా భక్తులు అమ్మవారికి పసుపునీళ్లను అభిషేకించి, పూజలు చేశారు. గ్రామంలోని ప్రధాన వీధులు, మెయిన్‌రోడ్డు మీదుగా తీన్‌మార్ డ్యాన్సులు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి గ్రామోత్సవం సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నవదుర్గ వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారి గ్రామోత్సవంలో ఆకట్టుకున్న నవదుర్గ వేషధారణలు

ఉద్యోగులకు ఫిజియోథెరపీపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

కోటనందూరు: ప్రభుత్వ ఉద్యోగులు వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డాక్టర్ బలివాడ రమేష్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన నిజాం కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బుధవారం ఫిజియోథెరపీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ చిన్నచిన్న వ్యాయామాలు చేయడం ద్వారా కీళ్లు, ఎముకలు, వెన్నుముక నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. విధి నిర్వహణలో మానసిక ఒత్తిడిని అదిగమించడంపై అవగాహన కల్పించారు. ఏఓ చిన్నారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై శిక్షణ

తుని రూరల్: చెడు వ్యసనాలతో ఆరోగ్యం క్షీణిస్తుందని, మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని హైదరాబాద్ నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ సంతోష్ కుమార్ సూచించారు. బుధవారం తుని ఎంపీడీఓ కార్యాలయంలో ఫిజియోథెరిపీపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

కోకో సాగుదారుల సమస్యలు నివేదిస్తాం

- ఐఐపీఎం శాస్త్రవేత్తలు నబీ రసూల్, నరేంద్రన్
- తేటగుంటలో రైతులకు కోకో సాగుపై అవగాహన

తుని రూరల్: కోకో సాగుదారుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ (బెంగళూరు) శాస్త్రవేత్తలు డాక్టర్ డి.నబీ రసూల్, డాక్టర్ నరేంద్రన్ పేర్కొన్నారు. బుధవారం తుని మండలం తేటగుంట గ్రామం పేరూరి గాంధీ కొబ్బరితోటలో జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు అధ్యక్షతన కోకో రైతుల అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథులుగా శాస్త్రవేత్తలు డాక్టర్ రసూల్, డార్టర్ నరేంద్రన్ పాల్గొన్నారు. కోకో విస్తీర్ణం పెంపు, సాగులో ఎదురవుతున్న సమస్యలు, నాణ్యతగల అధిక దిగుబడులు సాధనపై అధ్యాయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఐఐపీఎం బృందాన్ని నియమించినట్టు వారు చెప్పారు. ఆయా అంశాలు, సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలని రైతులు ఆశిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కోకో గింజలు విక్రయంతోనే ఆగిపోకుండా ప్రోసెసింగ్ విధానాలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు, గిట్టుబాటు ధర, చెల్లింపుల్లో అనుసరిస్తున్న విధానాలు, మధ్యవర్తులు లేకుండా ప్రభుత్వం ప్రకటించిన ధరకే కంపెనీలు నేరుగా కొనుగోలు చేయాలని రైతులు సూచించారు. అంతర్జాతీయ డిమాండ్‌కు అనుగుణంగా గిట్టుబాటు ధర చెల్లించాలన్నారు. సాగుదారులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలని, ప్రభుత్వాలు మారినా రైతులకు ఇవ్వాల్సిన రాయితీలు కొనసాగించాలన్నారు. రైతుల వినతులు, సమస్యలపై నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని డాక్టర్ రసూల్, డాక్టర్ నరేంద్రన్ హామీ ఇచ్చారు. జాతీయ, అంతర్జాతీయ అవసరాలకు అనువుగా అధికోత్పత్తి, నాణ్యతగల దిగుబడులు పెంపునకు తీసుకోవాలసిన జాగ్రత్తలను వివరించారు. హెచ్ఓ జి.విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, పేరూరి గాంధీ, చామంతి సత్తిబాబు, చిరంజీవిరాజు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐఐపీఎం శాస్త్రవేత్త డాక్టర్ నబీ రసూల్

రహదారి భద్రతపై డ్రైవర్లకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనువాస్

శంఖవరం: వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని కత్తిపూడి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనువాస్ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కత్తిపూడి నూకాలమ్మ ఆలయం ఆవరణలో లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్ వాడకూడదన్నారు. లారీ డ్రైవర్లు నిద్ర లేకుండా డ్రైవింగ్ చెయకూడదన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అన్నవరం ఎస్సై హరిబాబు, ఆటో, లారీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మెరుగైన సేవలందించాలి



కోటనందూరులో దివ్యాంగుల ఫిజియోథెరపీ సేవలను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

కోటనందూరు: ప్రత్యేక అవసరాల గల పిల్లలకు(దివ్యాంగులు) మెరుగైన సేవలందించాలని ఐఈ కోఆర్డినేటర్, సమగ్రశిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు భవితకేంద్ర సిబ్బందిని ఆదేశించారు. స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రతి వారం దివ్యాంగ చిన్నారులకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలపై ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావును ఆరా తీశారు. నిబంధనల మేరకు సేవలందించాలని సూచించారు. అనంతరం భవిత కేంద్రంలోని రికార్డులను పరిశీలించి అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాస్, రామశేఖర్, సీఆర్పీ శేఖర్, ఐఈఆర్పీలు నారాయణరావు, నాగగోవిందు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

తొండంగి: లారీ, ఇతర భారీ వాహనాల డ్రైవర్లు రవాణాశాఖ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని ఎ.కొత్తపల్లి, తొండంగి, శృంగవృక్షం ప్రాంతాల్లో బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. టిప్పర్ లారీలు, ఇతర వాహనాల రికార్డులను పరిశీలించారు. నంబర్ ప్లేట్లు సరిగ్గా లేని, రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు లేని, ట్రాక్స్ కట్టని వాహనాలకు రూ.53 వేల అపరాధ రుసుం విధించారు. 10 కేసులు నమోదు చేసి లారీలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు సకాలంలో ట్యాక్స్‌లు చెల్లించడంతో పాటు బీమా, డ్రైవింగ్ లైసెన్స్, పర్మిట్ వంటి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో వేంచిసిన లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి 8వ వార్షిక బ్రహోత్సవాలను గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఆదివారం వరకూ నాలుగు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాల్లో వీరభద్రుని సంబరం, 108 మంది కన్యలతో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి గ్రామంలో చెరువులో పడి వృద్ధురాలు మృతి చెందింది. వివరాల్లోకి వెళితే... వీరలంకపల్లి సెంటర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఆలయం వెనుక ఉన్న చెరువులో బుధవారం స్థానికులు మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీయగా మృతురాలు గోకవరంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన పత్తి చిట్టమ్మ(75)గా గుర్తించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మతిస్థిమితం లేకపోవడంతో ఆమె తరచూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోతుంది. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. ఈ క్రమంలో ఆమె బుధవారం తెల్లవారుజామున సమయంలో చెరువులో ప్రమాదవశాత్తూ పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై హెచ్‌సీ చంటియ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ఆత్మీయ సమావేశం

గండేపల్లి: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. మండలంలోని జెడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్ హాలులో బుధవారం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 6227 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారన్నారు. బీజేపీ, జనసేన పార్టీల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు దాట్ల కృష్ణవర్మ, తుమ్మలపల్లి రమేష్, ఎన్నికల అబ్జర్వర్లు గండి బాబ్జి, వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.